# వామనరావు-వాలుకుర్చీ

డి.హేమలత




ఆ రోజు వామనరావు రిటైర్మెంట్ రోజు. సాధారణంగా రిటైర్మెంట్ రోజు ఎవరయినా కొంచెం విచారంగా ఉంటారు. అందుకు భిన్నంగా వామనరావు చాలా ఆనందంగా ఉన్నాడు. అందుక్కారణం అతను చిన్న వయసులోనే ఉద్యోగంలో చేరడం, దాదాపు నలభై సంవత్సరాల సుదీర్ఘ సర్వీసు చేసి, అలసిపోయి, విసిగిపోయి ఇంటి సుఖం కోసం మొహం వాచి ఉండడమే. ఇప్పుడా సుఖం అందబోతున్నందుకే ఆ ఆనందం.

వామనరావు నెల రోజుల క్రితమే అటక మీద ఉన్న పాతకాలపు పడక్కుర్చీని తీసి శుభ్రం చేసుకున్నాడు. దానికున్న పాత పట్టాను తీసేసి కొత్తది వేయించి, రంగులు వేసి దానికో కొత్త కళ తెచ్చాడు.

ఆ కుర్చీకి యాభయ్యేళ్ల చరిత్ర ఉంది. అతని చిన్నతనంలో తన తాతగారు అందులో పడుకుని ఉండేవారు. ఆ తర్వాత అతని నాన్నగారు పదవీ విరమణ చేశాక అందులో సెటిలయ్యారు. ముప్పై ఏళ్ల పైచిలుకు ఆయన ఆ కుర్చీలో విశ్రమించి, ఆ తర్వాత తన పూర్వీకుల వద్ద విశ్రమించాడు. ఆ విధంగా ఆ కుర్చీకి మూడు తరాల చరిత్ర ఉంది.

యధావిధిగా ఫంక్షన్ పూర్తయ్యాక బంధువులంతా ఒక్కొక్కరూ వెళ్లిపోయారు. వామనరావు వాలుకుర్చీలో పడుకొని హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. పొడవుగా చేతులు మాదిరిగా ఉన్న చెక్కల మీద రెండు కాళ్లను ఎత్తి పెట్టుకొని, రెండు చేతులూ తల మీద ఆన్చేలా పెట్టుకొని, అరమోడ్పు కన్నులతో పక్కనున్న టీవీలో వార్తలు వింటూ స్వర్గ సుఖాన్ని అనుభవించసాగాడు.

'అహా! ఇన్నాళ్లూ ఎంత సుఖాన్ని మిస్సయ్యాను. వెధవది... ఉద్యోగం చేసి చేసి వళ్లు హూనమయ్యింది. జీవితమంతా ఆఫీసుకు వెళ్లడం... రావడం...వెళ్లడం, రావడంతోనే సరిపోయింది. ఇప్పుడిక ఆ అవసరం లేదు. ఆఫీసుకు టైమవుతుందనే టెన్షను లేదు' అనుకున్నాడు.

"భోజనానికి లేవండి" అంది భార్య.

వేడివేడి అన్నం, సాంబారు.. రెండు రకాల ఇగురు కూరలు.. రెండు పచ్చళ్లు.. నెయ్యి.. గడ్డపెరుగు... అందులో నంజుకోవడానికి ఆవకాయ... ఓహ్! ఆఫీసుకు వెళ్లేప్పుడు భార్య హడావిడిగా ఒక కూర, పచ్చడి, పెరుగు పెట్టేది. అదీ మధ్యాహ్నం తినబోయేసరికి చల్లారిపోయి రుచించేది కాదు.

తృప్తిగా తిని మళ్లీ వాలుకుర్చీలో పడుకున్నాడు.

సాయంత్రం అయ్యింది.

వేడిగా ఉల్లిపకోడి.. జీడిపప్పు మిఠాయి.. బ్రూకాఫీ..

"తిను నాయనా! ఉద్యోగం చేసేప్పుడు అర్ధాకలితో ఉండేవాడివి" అంటూ కొసరి కొసరి తినిపించే తల్లి.

టాయ్‌లెట్‌కు, భోజనానికి లేచి వెళ్లడం తప్ప మిగతా సమయమంతా వాలుకుర్చీలోనే గడిపేస్తున్నాడు వామనరావు. రాత్రిపూట మాత్రం పక్కనే ఉన్న దివాన్ కాట్‌మీదకు షిఫ్టవుతున్నాడు.

'ఆహా! గృహమే కదా స్వర్గ సీమ.. ఇంత ఆనందాన్ని ఇన్నాళ్లూ ఎలా మిస్సయ్యాను?' అని కించిత్ బాధపడ్డాడు కూడా!

"ఇన్నాళ్లూ మీ కుటుంబం కోసం, బిడ్డల కోసం శ్రమపడ్డారు. ఇప్పుడు మీ కోసం జీవించండి. మీలో ఉన్న రుచులు, అభిరుచులు అన్నీ హాయిగా అనుభవించండి. రిటైరన తరువాత అంతకుముందు మనం తీర్చుకోలేకపోయిన కోర్కెలన్నీ తీర్చుకోవాలి. ఇదే అసలైన జీవితం!" కొలీగ్ శ్యామ్‌సుందర్ మాటలు గుర్తొచ్చాయి.

'అభిరుచుల సంగతి తర్వాత! ముందు రుచుల సంగతి చూద్దాం' అనుకున్నాడు.

అవునూ! రుచులంటే జ్ఞాపకమొచ్చింది. తనకిష్టమైన టిఫిను పెసరట్టు, ఉప్మా!

"అమ్మా!" కేకేశాడు.

"ఏం నాయనా! ఏం కావాలి?"

పెరట్లో పని చేసుకుంటున్న తల్లి పరుగెత్తుకొచ్చింది. ఆమెకిప్పుడు కొడుకు చంటిపిల్లాడిలా కనిపిస్తున్నాడు.

"రేపు టిఫినేం చేస్తున్నారు?" అన్నాడు ఆతృతగా.

"కోడలు ఇడ్లీకి వేసినట్లుంది"

"వెధవిడ్లీ! రోజూ ఇడ్లీయేనా! పెసరట్టు, ఉప్మా చెయ్యండి!"

"అవున్నాయనా! నీకు పెసరట్లంటే ఎంతిష్టమో! చిన్నప్పుడు వేడి వేడి పెసరట్టు ఉప్మాతో నంజుకొని, ఆవురావురుమంటూ తినే వాడివి! కోడలితో చెప్తానుండు!" అంటూ వెళ్లింది.

మరో రోజు "పూరీ, బంగాళదుంప కూర చేయండి"

ఇంకో రోజు చపాతీ, చికెన్ కర్రీ... ఆ తర్వాత బ్రెడ్ ఆమ్లెట్! ఉల్లిదోశ, టమాటా బాత్... ఇలా అడిగి మరీ చేయించుకున్నాడు.

సాయంత్రం వేళల్లో మిరపకాయ బజ్జీలు, ఉల్లి పకోడి, వాటికి తోడు బజారు నుండి తెచ్చిన స్వీట్లు, హార్లిక్సు, పళ్లరసాలు.. ఒకటేమిటి... ఏది వదిలేది లేదు.

'అబ్బ! నిజంగా ఇంట్లో కూర్చుని ఇలా రకరకాలు తినేవారు ఎంత అదృష్టవంతులో' అనుకున్నాడు.

"కాంతం! ఒకసారిలారా! టీవీ స్విచ్ ఆన్ చేసి వెళ్లు! ఏదో వ్యాయామం ప్రోగ్రాం వస్తుందట! చూద్దాం" అన్నాడు భార్యతో.

"వ్యాయామం చేస్తే వస్తుంది. చూస్తే కాదు! లేచి టీవీ స్విచ్ కూడా వేసుకోలేరా? అవునూ! నాకు తెలియక అడుగుతాను! అలా పొద్దస్తమానం ఆ పడక్కుర్చీలో పాతగుడ్డల మూట కుదేసినట్టు ఇరుక్కుని కూర్చుంటారు. కాళ్లు నొప్పి పెట్టవా? కాస్త అటూ ఇటూ తిరగండి!" అంది.

అత్తగారు గయ్యిమంటూ లేచింది.

"ఏమే! నా కొడుకు ఇన్నాళ్లూ రెక్కలు ముక్కలు చేసుకుని, ఒకటి కాదు రెండు కాదు నలభై ఏళ్లు కష్టపడి పనిచేసి, మీ కోసం సంపాయించాడు. ఇప్పుడు కాస్త విశ్రాంతి తీసుకుంటుంటే ఓర్చుకోలేక పోతున్నావ్! కుళ్లు!" అంది చివరి మాట వత్తి పలుకుతూ.

"అయ్యో రామ! నేనేమన్నానండి! కాస్త లేచి అటు ఇటు తిరిగితే ఆరోగ్యానికి మంచిదంటున్నాను!" అంది కాంత.

"ఓయబ్బో! పెద్ద... ఆరోగ్యమ్మ చెప్పొస్తుందండీ! అవన్నీ వాడికి తెలియవా? నువ్వు తిరుగుతున్నావుగా

రోజంతా బొంగరంలా! ఇంట్లోకి బయటకి! వాడి బదులు కూడా తిరుగు" అత్తగారు.

ఈ గొడవ ఇంకా పెద్దదయ్యేలాగా ఉందని భావించి- "ఆపండే గోల! నన్ను కాస్త రెస్ట్ తీసుకోనివ్వండి! హార్లిక్స్ పట్రా!" అన్నాడు గట్టిగా భార్యకేసి చూస్తూ.

భార్య గ్లాసుడు పాలల్లో హార్లిక్స్ కలిపి తెచ్చింది.

ఖాళీ గ్లాసు కింద పెట్టేసి, మళ్లీ కళ్లు మూసుకున్నాడు. పడుకునే నోట్లో పోసుకోవడం వలన కాసిని బనీను మీద గడ్డం కిందా పడ్డాయి.

అది చూసి భార్య కిసుక్కున నవ్వింది.

వామనరావు గుడ్లురిమి చూశాడామె వైపు.

"టవల్ పట్రా" అన్నాడు కోపంగా.

తుడుచుకుని మళ్లీ కళ్లు మూసుకున్నాడు.

"ఆఫీసులో కూడా ఇలాగే నిద్రపోయే వారేమో!" అని గొణుక్కుంటూ లోపలికెళ్లింది భార్య.

నెల రోజులయ్యిందప్పుడే వామనరావు రిటైరై. అసలే ఆఫీసులో కూర్చుని చేసే ఉద్యోగంతో పెరిగిన పొట్ట. ఇప్పుడు ఖాళీగా తిని పడుకోవడంతో మరింత పెరిగి బోర్లించిన కుండలా ఉంది. వామనరావు నిద్రలో పెట్టే గురకకు అది పైకి కిందకూ కదులుతూ ఉంది.

ఓ రెండు గంటలు నిద్రపోయాక "మంచినీళ్లు" అన్నాడు కొద్దిగా కళ్లు తెరిచి.

కుర్చీ పక్కన ఉన్న నీళ్లబాటిలు అతని చేతికందించింది భార్య. వామనరావు పడుకునే బాటిలు



ఎత్తి నోట్లో పోసుకుని "ఛీ! చల్లగా లేవు! ఫ్రిజ్‌లోవి పట్రా!" అన్నాడు.

కొద్దిగా తాగి, మళ్లీ రెండు చేతులూ వేళ్ల బంధనం వేసుకొని, గడ్డం దగ్గర ఆనించుకుని నిద్రలోకి జారుకున్నాడు.

'నిద్ర...నిద్ర....నిద్ర..ఎలా నిద్రపోతారు అన్నేసి గంటలు! కొంప దీసి, ఇదేమన్నా జబ్బు కాదు గదా! పెద్ద పెద్ద పరుపుల కంపెనీలు మా పరుపు మీద పడుకుంటే ఇంత హాయిగా నిద్రపోవచ్చు అని చూపించడానికి హాయిగా నిద్రపోయే వారిని ఎంచుకుని ఉద్యోగమిస్తారట! ఈయన్ని అక్కడికి పంపొచ్చు' అనుకుంది భార్య.

"భోజనానికి లేవరా! లోపలికొస్తావా? భోజనం అక్కడికే తెమ్మంటావా?" అడిగింది తల్లి.

"నాకప్పుడే వద్దు! ఆకలిగా లేదు. మీరు తినెయ్యండి!" చెప్పాడు వామనరావు.

"అయ్యో! నువ్వు తినకుండా మేమెలా తింటాంరా! నీకిష్టమైనవన్నీ చేశాం. వేడిగా ఉండగానే కొద్దిగా తిను" అంటూ వాలుకుర్చీ చేతుల మీద చిన్న బల్ల వేసి పదార్థాలన్నీ పళ్లాల్లో సర్ది తెచ్చి పెట్టింది తల్లి.

చెయ్యి కడుక్కోడానికి నీళ్లు తెచ్చింది భార్య.

కదలకుండా కూర్చోవడంతో వామనరావుకు సాయంత్రానికి పొట్ట

పట్టేసినట్టయింది. కాళ్లలోని రక్తనాళాల్లో రక్త ప్రసరణ లేక కాళ్లు తిమ్మిర్లు వచ్చి అనీజీగా ఫీలయ్యాడు.

కడుపులో తిప్పినట్టుగా ఉండి ఒక వాంతి కూడా అయ్యింది.

"అయ్యో! పిల్లాడికి దిష్టి తగిలినట్టుంది" అంటూ తల్లి విలవిల్లాడిపోయి నాలుగు ఎండుమిరపకాయలు, ఉప్పు తెచ్చి దిష్టి తీసి పొయ్యిలో వేసింది.

మిరపకాయల ఘాటుకు వామనరావుకు దగ్గు వచ్చి ఊపిరి తీసుకోవడం కష్టమయ్యింది. ఆయాస పడిపోతుంటే అందరూ కంగారు పడిపోయారు.

ఊళ్లోనే ఉన్న బావమరిది పరుగుపరుగున వచ్చాడు.




"అసలు విషయమేంటి? ఏం జరిగింది. ఎంతో ఆరోగ్యంగా ఉండేవాడు. ఎందుకిలా అయ్యాడు?" అన్నాడు.

"అనారోగ్యం ఏమీ లేదురా! ఉన్నట్టుండి వాంతి అయ్యింది. దగ్గు, ఆయాసం" చెప్పింది వామనరావు భార్య.

"ఏం పెట్టావక్కా?" అన్నాడు దీర్ఘం తీస్తూ.

"పొద్దున్న పెసరట్టు, ఉప్మా! మధ్యాహ్నం టమాటా పప్పు, ఆమ్లెట్, పెరుగు..."

"అబ్బో! చాలా హెవీ డైట్! పని తక్కువ, తిండి ఎక్కువ! అజీర్ణం అయ్యుంటుంది. అంతకంటే ఏం లేదు. బావగారూ! రిటైర్ అయ్యాం గదాని తిని పడుకుంటే ఇంతే మరి! కాస్త వాకింగ్ చెయ్యాలి. ముందా పొట్ట తగ్గించుకోవాలి" అన్నాడు.

వామనరావు తననేమన్నా సహిస్తాడు గానీ, తన పొట్ట గురించి ఎవరైనా ఏమైనా అంటే పట్టరాని కోపమొస్తుంది.

"సర్లే! పొట్టలేందెవరికి? ఇప్పుడేమయిందని! చిక్కటి బ్రూ కాఫీ తాగితే అంతా సర్దుకుంటుంది" అన్నాడు.

కాఫీ త్రాగుతూ "ఏంటి కబుర్లు?" అన్నాడు బావమరిదితో.

"కబుర్లూ కాకరకాయలూ ఏం లేవుగానీ, ముందు మీరా కుర్చీ దిగకపోతే, తర్వాత మేమందరం కుర్చీలో నుంచే బయటకు మోయాల్సొస్తుంది జాగ్రత్త!"

"ఏం మాటలబ్బాయ్! ఇప్పుడేమయిందని! కాస్త పొట్ట ఉబ్బరం చేసిందంతే! చిటికెడు వాము తింటే సరిపోతుంది" అంది వామనరావు తల్లి కోపంగా.

"సరే! వస్తా బావగారూ జాగ్రత్త! అదే పొట్ట జాగ్రత్త! ఐ మీన్... ఆరోగ్యం జాగ్రత్త" అని చెప్పి వెళ్లిపోయాడు.

మర్నాడు ప్రొద్దున్న తొమ్మిదింటికి నిద్రలేచాడు వామనరావు. పనేం లేదు గదాని మళ్లీ కళ్లు మూసుకుని పడుకున్నాడు. తను ఆఫీసుకెళ్లే రోజుల్లో ఆరు గంటలకల్లా నిద్రలేచేవాడు. కాలకృత్యాలు తీర్చుకుని, పూజ చేసుకుని కాఫీతాగి ఓ గంటసేపు పేపరు చదువుకునే వాడు. తర్వాత నిదానంగా టిఫిను తిని, భార్య అందించిన క్యారియరు తీసుకొని ఆఫీసుకెళ్లేవాడు. మళ్లీ సాయంత్రం ఆరింటికి ఇంటికొచ్చేవాడు.

ఇప్పుడు రోజంతా ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు. ఆలోచిస్తూ బాత్రూంకెళ్లి, బ్రష్ మీద పేస్టు వేసుకోబోయేడు. గట్టిగా నొక్కడంతో టూత్ పేస్టు ట్యూబ్‌లోదంతా 'టప్'మని శబ్దం చేస్తూ జానెడు బారున బయటకొచ్చేసింది. దాన్ని దూరంగా విసిరి కొట్టి పచార్లు చేస్తూ పళ్లు తోముకోసాగాడు.

తను ఆఫీసుకెళ్లే రోజుల్లో దార్లో పది గంటలప్పుడు అరుగు మీద కూర్చుని నోట్లో బ్రష్ పెట్టుకుని పేపరు చదువుకునే రంగస్వామి గుర్తొచ్చాడు. అప్పుడతన్ని చూసి తనెంత ఈర్ష్య పడేవాడో!

రిటైరైన తర్వాత తనూ అలా చెయ్యాలనుకునే వాడు.

'వీళ్లంతా జీవితాన్నెంత బాగా ఎంజాయ్ చేస్తున్నారు? ఏదో సర్వేలో చెప్పినట్టు ఇండియాలో కష్టపడి



## 'రోబో' డానీ

హిందీ చిత్రసీమలో డానీ డెన్‌జోంగ్పాకి తనదైన ఇమేజ్ వుంది. క రడుగట్టిన విలన్‌గా ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించిన డానీ చాలా కాలంగా తెరమరుగయ్యాడు. మళ్లీ ఇంత గ్యాప్‌తో 'రోబో' ద్వారా తన విలనీని ప్రదర్శించబోతున్నాడిప్పుడు. రజనీకాంత్ 'రోబో'లో విలన్ ఎవరు? ఎవరూ? అంటూ ఇప్పటి వరకూ సందేహాలు సాగుతూనే వున్నాయి. 'శివాజి'లో విలన్‌గా వేసిన సుమనే ఇందులోనూ విలన్ అనీ, హీరో అర్జున్ విలన్‌గా నటిస్తున్నాడనీ ఇలా రకరకాలు ఊహాగానాలు సాగాయి. ఇంత సస్పెన్స్‌గా సాగిన విలన్ ఎవరన్నది ఈ చిత్రం ట్రెయిలర్స్ వచ్చే వరకూ జనాలకి తెలియకపోవడం విశేషమే!

పనిచేసే వారి సంఖ్య నూటికి ఇరవైమందేనట. మిగతా ఎనభై మంది ఆవారాగా తిని తిరిగే వారేనట. పాపం! ఇంట్లో రోజంతా చాకిరీచేసే ఆడవాళ్లను కూడా ఆ ఎనభై మందిలో చేర్చుంటారు'

ఆలోచిస్తూనే కాలకృత్యాలు తీర్చుకుని, మళ్లీ వాలుకుర్చీ చేరుకున్నాడు.

"వాముడూ! పూరీ, బంగాళాదుంప కూర చేశాం. పట్రమ్మంటావా?" కేకేసింది తల్లి, వంటింట్లో నుంచే.

'తెమ్మన లేదు, వద్దనలేదు.. సందిగ్ధ పరిస్థితి' చివరకు జిహ్వాచాపల్యం చంపుకోలేక ఓ నాలుగు లాగించేశాడు.

కాసేపటికి పులిత్రేన్పులు... కడుపుబ్బరం!

జీర్ణకోశానికి అధిక శ్రమ కావడంతో వళ్లంతా వేడెక్కి జ్వరం కూడా వచ్చింది.

సొంత వైద్యం కొంత చేసుకున్నాడు.

అప్పటికి శాంతించినా, రెండ్రోజులకు అనారోగ్యం మళ్లీ తలెత్తింది.

మెడికల్ షాపులో ఏవో టాబ్లెట్లు తెచ్చుకొని వాడుకున్నాడు.

కొన్ని రోజులు బాగానే ఉంది.

మళ్లీ మొదలు... కాళ్లూ, చేతులు నొప్పులు... నిద్ర పట్టదు. ఆఫీసుకెళ్లే రోజుల్లో రాత్రి ఎనిమిది గంటల నుండి ఉదయం ఆరు గంటల వరకు ఎంత నిద్ర పట్టేది!

శరీరానికి ఎటువంటి పనీ లేనందువల్ల నిద్రపట్టడం లేదనే నిజాన్ని ఒప్పుకోలేక పోతున్నాడు.

బామ్మర్ది సహాయంతో ఓ డాక్టరు దగ్గరకెళ్లాడు.

డాక్టరు అన్ని టెస్టులూ చేసి, "ఏమీ లేదు గానీ, డైలీ వాకింగ్ చేయండి" అన్నాడు.

బామ్మర్ది రాజు హోమియోపతి, ఆయుర్వేదం, యునాని అన్ని మందులూ తెచ్చిచ్చాడు.

తండ్రికి బాగోలేదని తెలిసి, పిల్లలంతా వచ్చారు. వారికి తెలిసిన చిట్కా వైద్యాలు కొన్ని చెప్పారు.

వామనరావు రోజురోజుకూ క్షీణించి పోతున్నాడు.

నీరసం వలన భోజనం, టిఫిన్ అక్కడకే తెప్పించుకుంటున్నాడు.




బెడ్ ప్యాన్ పెట్టించుకుంటే బావుండదని మెల్లగా బాత్రూం వరకు లేచి వెళ్తున్నాడు.

స్నేహితులు, బంధువులు వచ్చి చూసి వెళ్తున్నారు.

"పాపం! రిటైర్మెంటు వలన డిప్రెషన్ వచ్చుంటుంది. కొందరికి డిప్రెషన్‌లో హార్ట్ ఎటాక్ కూడా వస్తుంది. జాగ్రత్త" అన్నాడో ఫ్రెండ్.

"మీ ముఖంలో జీవకళ పోయిందండీ" అన్నాడు మరొకడు, 'చావు కళ కనిపిస్తోంది' అనలేక.

వామనరావుకిప్పుడు కొత్తగా భయం, గుండెదడ పట్టుకున్నాయి. డాక్టరు దగ్గరకెళ్లే ఓపిక లేదు.

తానేదయితే అమరసుఖమని అపోహ పడ్డాడో, ఇప్పుడదే తన పాలిట శాపమయ్యింది.

బామ్మర్ది రాజు డాక్టర్నే ఇంటికి తెచ్చాడు.

ఇంటికొచ్చిన డాక్టరుకు పరిస్థితి అర్థమైంది.

కాళ్లూ, చేతులూ కదిలించకుండా వాలుకుర్చీలో కుప్పలా పడి ఉన్న వామనరావును చూసి "ముందాయన్ని కుర్చీలో నుండి లేపండి!" అన్నాడు.

తల్లీ, భార్య, బామ్మర్ది కలిసి వామనరావును లేపి, మంచం మీద పడుకోబెట్టారు.

డాక్టరు వామనరావు వైపు చూస్తూ..."జబ్బు మీలో లేదు. మీరు పడుకున్న ఆ కుర్చీలో ఉంది. ముందా కుర్చీని బైట పారెయ్యండి. రిటైర్‌మెంటనేది ఉద్యోగం నుండి మాత్రమే. జీవితం నుండి కాదు. రిటైర్మెంటు తర్వాతా జీవితం ఉంది. బాధ్యతలు లేవు గదాని, ఇలా ఏ పనీ లేకుండా తిని కూర్చుంటే అన్ని రకాల రోగాలూ కమ్ముకొస్తాయి. శరీరంలోని అన్ని అవయవాలకు కదలిక ఉండాలి. అప్పుడే తిన్న ఆహారం సక్రమంగా జీర్ణమై రక్తంలో కలుస్తుంది. శరీరానికి ఆహారమే కాదు, వ్యాయామమూ అవసరమే. మనిషికి విశ్రాంతి అవసరమే కానీ, అతిగా కాదు. ఏదైనా వస్తువును వాడకుండా మూలన పడేస్తే కొన్నాళ్లకు త్రుప్పు పట్టి పనికి రాకుండా పోతుంది. శరీరమూ అంతే. మీరు కదలకుండా కుర్చీలో పడుకోవడం వలనే కాళ్లూ, చేతులూ నొప్పులు, రక్తప్రసరణ సరిగా లేకపోవడం వలన వచ్చాయి. ఇంకా కొన్నాళ్లు అలాగే ఉంటే అవి చచ్చుబడిపోయేవి" అని చెప్పాడు.

వామనరావు అర్జెంటుగా ఓ పార్ట్‌టైం జాబ్ వెతుక్కున్నాడు. ఇప్పుడతనికి కాళ్ల నొప్పులు గానీ జీర్ణకోశ బాధలుగానీ లేవు. ఇంటా బయటా అందరితో సరదాగా తిరుగుతూ హాయిగా కాలక్షేపం చేయసాగాడు.

# బాలకృష్ణ నమ్మకం!

పూరి జగన్నాథ్ దర్శకత్వంలో బాలకృష్ణ నటిస్తాడని ఆమధ్య వార్తలొచ్చాయి. అయితే పూరి చెప్పిన కథలేవీ బాలయ్యబాబుకి నచ్చక పోవడంతో ఆ సినిమా అక్కడితో ఆగిపోయింది. అయితే ఇటీవల 'రెచ్చిపో' లాంటి దారుణమైన ఫ్లాప్ సినిమాకి దర్శకత్వం వహించిన పరుచూరి మురళి దర్శకత్వంలో ఓ సినిమా చేయడానికి బాలకృష్ణ అంగీకరించడం సినీజనాలను ఆశ్చర్యంలో పడేసింది. నీ స్నేహం, ఆంధ్రుడు, పెదబాబు సినిమాలకు దర్శకత్వం వహించిన మురళికి చెప్పుకోదగ్గ పేరు లేకపోయినా బాలయ్య బాబు అతన్ని ఎంకరేజ్ చేయడం విశేషమే కదా!

